

చార్లీ చాప్లిన్ ఆదర్శప్రాయుడు

ప్రజాశక్తి - సాలూరు

ప్రపంచ ప్రఖ్యాత హాస్యనటుడు చార్లీ చాప్లిన్ ఆదర్శప్రాయుడని సాలూరు సాహితీ మిత్రబృందం సభ్యులు ఆకుల గణపతి మాష్టారు అన్నారు. ఆదివారం పట్టణంలోని వెలంపేట సీతారామ కళ్యాణమండపంలో చార్లీ చాప్లిన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చార్లీ చాప్లిన్ చిన్నతనం నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ కళా రూపాలతో ప్రపంచానికి వినోదాన్ని పంచిపెట్టారని చెప్పారు. ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ చార్లీచాప్లిన్ గొప్ప మానవతావాది, కమ్యూనిస్టువాది అని కొనియాడారు. తాను కష్టాలు పడుతూ తన సినిమాల ద్వారా ప్రపంచానికి పెట్టుబడిదారీ వ్యవస్థలోని లోపాల్ని ఎత్తి చూపారని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

నల్ల బజారుకు తెల్లబియ్యం

- పక్క రాష్ట్రానికి అమ్మకాలు
- రీసైక్లింగ్ తో స్థానికంగా అమ్మకాలు
- రూ. లక్షల్లో అక్రమ వ్యాపారం

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. దళారులు నేరుగా లబ్దిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి మిల్లర్లకు ఎగుమతి చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం మండలంలో అన్ని వ్యాపారాలకు అనుకూలంగా ఉన్న రెండు ప్రధాన గ్రామాల్లో అక్రమార్కులు సిండికేటై లావాదేవీలు చేస్తున్నట్లు సమాచారం. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి బహిరంగ మార్కెట్లో రకరకాల బ్రాండ్ల పేరుతో విక్రయాలు చేస్తున్నారు. రేషన్ బియ్యం మాఫియాను నియంత్రించాల్సిన పౌరసరఫరాలు, విజిలెన్స్ శాఖ అధికారుల పర్యవేక్షణా లోపంతో అక్రమాలకు అడ్డుకట్ట పడడంలేదు. స్థానికంగా సేకరించిన బియ్యాన్ని పక్క రాష్ట్రమైన ఒడిశాలోని మిల్లులకు తరలించి, అక్కడ రీ సైక్లింగ్ చేసి, తళతళలాడే తెల్లని తెలుపు వచ్చేలా పాలిష్ చేయిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో బియ్యాన్ని వాహనాలు మార్చి తరలిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు విఫలయత్నం అవుతున్నాయి.



ఇటీవల కురుపాంలో వాపారి వద్ద అధికారులు పట్టుకున్న పిడిఎస్ బియ్యం (ఫైల్)

లబ్ధిదారుల నుంచి రూ.16 చొప్పున కొనుగోలు

లబ్ధిదారుల నుంచి కేజీ రూ.16 చొప్పున కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇంటింటికీ రేషన్ వాహనాల నిర్వాహకులు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర తీసుకుని లబ్ధిదారులకు కోటా బియ్యాన్ని అందజేస్తున్నారు. ఇలా రేషన్ వచ్చే బియ్యంలో రీసేల్ అవుతుండగా 80 నుంచి 85 శాతం వరకు మాత్రమే పేదలు తీసుకుంటున్నారు. ఈ బియ్యాన్నే డీలర్లు, లబ్ధిదారుల నుంచి వ్యాపారులు, దళారులకు కిలో రూ.16 చొప్పున కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు సమాచారం. వీటిపై విజిలెన్స్, సివిల్ సప్లై తనిఖీలు నామమాత్రంగా ఉండడంవల్లే వీరి దందాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది.

యథేచ్ఛగా బహిరంగ మార్కెట్లో విక్రయాలు

లబ్ధిదారులు నుంచి సేకరించిన బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి యథేచ్ఛగా తిరిగి బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. 50 శాతానికి పైగా పక్క రాష్ట్రానికి తరలి పోతున్నాయి. మరో 50 శాతం లోకల్ మార్కెట్లో వివిధ బ్రాండ్ల పేరుతో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నాయి. 25 కేజీల బస్తా రూ.1050 నుంచి రూ.1100 చొప్పున బియ్యం వ్యాపారులు తిరిగి విక్రయిస్తున్నారు. ప్రముఖ కంపెనీల బ్రాండ్ల పేరుతో సైతం రీసైక్లింగ్ బియ్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కాలంలో బియ్యం ధరలు 25 కేజీల బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకూ ధరలు పెరిగిన విషయం విదితమే. దీంతో అత్యధికంగా మధ్య తరగతి గిరిజన ప్రజలు తక్కువ ధరకు వస్తున్నాయని పాలిష్ చేసిన బియ్యాన్ని కొనుగోలు చేసుకుని వినియోగిస్తున్నారు. ఈ దందాతో దళారులు, మిల్లర్లు పెద్ద ఎత్తున లాభాలు కూడబెట్టకుంటున్నప్పటికీ, మధ్య, దిగువ తరగతి గిరిజన ప్రజలు ఆర్థికంగానూ, ఆరోగ్యపరంగా నష్టపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజా పంపిణీ బియ్యం అక్రమ వ్యాపారాన్ని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు



ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరం. లబ్ధిదారులు కూడా దీనిపై అవగాహన కలిగి ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల పోషణకు అందజేస్తున్నాయి. దుర్వినియోగం చేయకూడదు. క్షేత్రస్థాయిలో పరిశీలన పెంచాం. రేషన్ బియ్యం కొనుగోలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తాం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ఎ. సాంబశివరావు
సివిల్ సప్లై డి టి, కురుపాం.

ప్రజా వ్యతిరేక, నిరంకుశ బిజెపిని గద్దె దించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని గద్దె దించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఐ-సిపిఎం ప్రచార భేరి యాత్ర మండలంలోని గెంజిగెడ్డ, కొయ్యిమెట్టవలస, లక్ష్మణదొర వలసలో ఆదివారం పాదయాత్ర, సభలు, సమావేశంలో కరపత్రాల పంపిణీ ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ బిజెపి నిరంకుశ విధానాలుపైన, దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన బిజెపిని, దానికి సహకరించే శక్తులను వ్యతిరేకించాలన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడకుండా, ఆ పార్టీకి సహకరిస్తున్న వైసిపి, టిడిపి, జనసేన తదితర శక్తులను ఎండగట్టాలని, ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలని, గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల్లో జరిగే సభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.రామస్వామి, మండల శాఖ నాయకులు పి.రాము, లెండి, తిరుపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు చెప్పారు. ఆదివారం పట్టణంలోని 6,7,8, వార్డుల్లో సిపిఎం సిపిఐ ఆధ్వర్యాన ప్రచారభేరి జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం జిల్లాకమిటీ సభ్యులు ఎన్వై నాయుడు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడమే ధ్యేయంగా పని చేస్తుందని, ప్రజలపై భారాలు వేస్తూ కార్పొరేట్లను పెంచి పోషిస్తుందని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి.శంకర్, టి.ఇందు, టి.రాముడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రచారభేరిలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు



ప్రచారభేరిలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రామస్వామి

సీతానగరం : బిజెపి పాలనతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలని, లేకుంటే మనందరి భవిష్యత్తు చీకటమయమైపోతుందని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని అప్పయ్యపేటలో సిపిఎం ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడుకుందామని, కేంద్రం మద్దతుతో రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గవర వెంకటరమణ, వై.రామారావు, పి.చిన్నారావు, ఆర్.రాము తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని గోగాడవలస, పాంచాలిలో ప్రచార భేరి జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్ల కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ బిజెపి పాలనతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని తొందరగా సాగనంపకపోతే భారతదేశానికి భవిష్యత్తు ఉండదని అన్నారు.

కొమరాడ : మండలంలోని గుమడ సంత, సరాపాడు, సీసాడవలస, కొత్తవలస గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచారభేరి పోస్టర్లను చేతబటి గ్రామాల్లో ర్యాలీ, సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రధాని మోడీ విధానాలు దేశానికి, రాష్ట్రానికి నష్టదాయకంగా ఉన్నాయని, కార్పొరేట్ శక్తులకు దేశ సంపద కట్టబెట్టి, ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. ఇలాంటి సందర్భంలో అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు రాబోయే రోజుల్లో జరిగే పోరాటాల్లో పాల్గొని బిజెపిని సాగనంపి, దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాలు, సిపిఎం నాయకులు ఎ.ఉపేంద్ర, రెడ్డి శివున్నాయుడు, హెచ్.లక్ష్మయ్య, కె.సంగమ్మ, బి.సోములు, చిలకమ్మ, సోములు, గౌరమ్మ, పకీరు, ప్రసాదు, లక్ష్మణరావు, వెంకటరావు, పోలినాయుడు, తిరుపతిరావు, స్వామినాయుడు పాల్గొన్నారు.







పాచిపెంటలో పోస్టర్‌తో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు ; సాలూరులోని పురవీధుల్లో ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు ; కొమరాడలోని గుమడ సంతలో ర్యాలీ చేస్తున్న నాయకులు

మండుతున్న ఎండలు.. అడుగంటుతున్న బావులు

గిరిజనుల దాహం కేకలు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా నేటికీ గిరిజనులు గుక్కెడు నీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల పరిస్థితి మరీదారుణం. మా గ్రామాలకు తాగునీరందించండి మహా ప్రభో అంటూ కొన్ని వందలసార్లు విన్నవించినా పాలకుల్లోనూ, అధికారుల్లోనూ చలనం ఉండడం లేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో చలములు, గెడ్డవాగులపై ఆధారపడి కలుషిత నీటిని తాగుతున్నారు. దీంతో అనారోగ్యానికి గురై రోగాల బారిన పడుతున్నారు.

వేసవి కాలం వచ్చిందంటే చాలు ఏజెన్సీలో నీటి సమస్య జటిలమవుతుంది. కొండ శిఖర ప్రాంతాలైన గోరటి, తోట, వామసి, శిఖర పాయి, జర్న, వనకాబడి, వాడపుట్టి, జోగిపురం తదితర గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో బోర్లు నిర్మాణం జరగలేదు. దీంతో ఇక్కడ గిరిజనులు చలమలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ ఏడాది ఎండల ప్రభావం ఎక్కువగా ఉండడంతో చలములు, బావులు కూడా అడుగంటుతున్నాయి. సప్పగూడలో గిరిజనులు గత 40 ఏళ్ల నుంచి బావి నీటిపై ఆధారపడుతున్నారు. మండు వేసవి కారణంగా నీరు అడుగంటుందని, కలుషిత నీటిని వినియోగిస్తున్నామని గిరిజనులు తెలిపారు. నిత్యవసరాలకు, పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వంటలకు ఈ నీటిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. దుడ్డుఖల్లు, ఇరిడి గ్రామాల్లో తరుచూ నీటి సమస్య ఎదురవుతుందని గ్రామస్తులు తెలిపారు. పై గ్రామాల్లో ఒకే ట్యాంకు, ఒకే మోటర్‌పై ప్రజలు ఆధారపడడంతో నీరు చాలడం లేదని అంటున్నారు. మండలంలో 27పంచాయతీలు ఉండగా 600 వరకు బోర్లు ఉన్నాయి. వీటిలో సగం బోర్లు పనిచేయని పరిస్థితి. మరోవైపు ఆర్డబ్ల్యూఎస్, సోలార్ రక్షణ పథకాలు ఉన్నా మోటార్లు ఎప్పటికప్పుడు మరమ్మతులకు గురవ్వడంతో నీటి సమస్య తప్పడం లేదు. నీటి సమస్య నివారణకు అధికారులు మైదాన ప్రాంతాల్లో క్రాస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నా కొండమీద గ్రామాల్లో మాత్రం నీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదని గిరిజన సంఘాల నాయకులు వాపోతున్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

గిరిజన గ్రామాల్లో వేసవి ఎద్దడి నుంచి నీటి సమస్య పరిష్కారానికి అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలి. క్రాస్ ప్రోగ్రాం ద్వారా కేవలం బోర్లు మాత్రమే మరమ్మతులు చేస్తున్న అధికారులు రక్షిత పథకాలపై కూడా దృష్టి సారించాలి.

కోలక అవినాష్
ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



నాచు పట్టిన బావి నీరు

డబ్బులిచ్చి మోసపోయాననే వ్యథతోనే..

ప్రజాశక్తి - పొందూరు

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం బురిడి కంచరాంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విజయనగరం జిల్లా రాజాం మండలం పెనుబాక గ్రామానికి చెందిన బుడ్డెపు రామకృష్ణ (35) శనివారం మృతి చెందాడు. 16 రోజుల పాటు శ్రీకాకుళం రిమ్స్‌లో మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం...

పొందూరు మండలం బురిడికంచరాంకి చెందిన గులివిందల అసిరి నాయుడు సైనిక పాఠశాలలో పిల్లలకు సీట్లు ఇప్పిస్తానని నమ్మబలికి రామకృష్ణ నుంచి రూ.16 లక్షలు తీసుకున్నాడు. సైనిక పాఠశాలలో సీటు రాకపోవడంతో మోసపోయానని గ్రహించి తన డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ అసిరినాయుడును కోరాడు. ఎన్నిసార్లు అడిగినా ఇదిగో, అదిగో అంటూ తప్పించుకునేవాడు. దీంతో గత నెల 31న బురిడికంచరాం వెళ్లి అడగగా 'నేను ఇవ్వను ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో' అని అనడంతో తన వెంట తెచ్చుకున్న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న రామకృష్ణను గ్రామస్తుల సహకారం తో భార్య శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తోంది. శనివారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

మండల కేంద్రమైన జియ్యమ్మవలస ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్ తోటపల్లి సుజాతను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఎపి వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత అనేక అవినీతి, ఆరోపణలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయని, వీటిపై సీతంపేట ఎపిడి విచారణ చేయగా, ఆరోపణలు వాస్తవమేనని రుజువైనా ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. విఒఎ, ఎఎన్ఎం, హెచ్‌పిసిఎల్ కంపెనీల్లో పనిచేస్తున్న వారి పేరున పనికి వెళ్లకుండానే అనేక ఏళ్లుగా ఎన్ఎంఆర్‌లు రాసి లక్షలాది రూపాయలు స్వాహా చేసినట్టు విచారణలో రుజువైందన్నారు. అలాగే స్థానికంగా ఉన్న చిరు వ్యాపారులు, అనేకమంది వలస కూలీలు పనికి వెళ్లకుండా ఎక్కడో వలసల్లో ఉన్న వారి పేరున బిల్లులు వేసి ఫీల్డ్ అసిస్టెంట్, కొంతమంది నాయకులు, మేట్లతో కుమ్మక్కై అనేక ఏళ్లుగా లక్షలాది రూపాయలు కాజేశారని తెలిపారు. ఈ అవినీతి భాగోతం సామాజిక తనిఖీల్లో తోటపల్లి సుజాతపై ఆరోపణలు వచ్చి విచారణలో వాస్తవమని తేలినప్పటికీ ఇప్పటి వరకు సస్పెండ్ చేయలేదన్నారు. అధికారులు మాయమాటలు చెబుతూ సుజాతను తొలగించకుండా ఆమె అవినీతికి కొమ్ముకాస్తున్నారన్నారు. కొన్ని గ్రామాల్లో ఎలాంటి పొరపాట్లు చేయకపోయినా కావాలనే కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ కక్షతో అధికారులు, అధికార పార్టీ నాయకులు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. జియ్యమ్మవలస ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడినట్లు తేలినప్పటికీ తొలగింపులో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా తోటపల్లి సుజాతను పూర్తిగా విధుల నుంచి తొలగించకపోతే ఉపాధి హామీ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక నాయకులు బి. మోహన్ రావు, కె.సీతారాం పాల్గొన్నారు

మాత, శిశు మరణాల నివారణే లక్ష్యం

- మిషన్ వాత్సల్యకు 8 వేల దరఖాస్తులు
- బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు
- 'ప్రజాశక్తి'తో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయగౌరి ముఖాముఖి

జిల్లాలో మాతా, శిశుమరణా నివారణే లక్ష్యంగా జిల్లాలో అంగన్‌వాడీ వ్యవస్థ పనిచేస్తుందని స్త్రీ, శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ (ఇన్‌ఛార్జి) కె.విజయగౌరి చెప్పారు. ఇందులో భాగంగా గర్భిణులతో పాటు బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తూ, ఆరోగ్యంపట్ల సలహాలు, సూచలను ఎప్పటికప్పుడు అందజేస్తున్నామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారుల్లో రక్తహీనత తొలగించేందు పటిష్ట చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు పటిష్టచర్యలు చేపడుతున్నామని, మిషన్ వాత్సల్య పథకానికి జిల్లా నుంచి 8వేల వరకు దరఖాస్తు వచ్చాయని తెలిపారు. వీటితో పాటు జిల్లాలో మాతా, శిశుమరణాలకు తీసుకుంటున్న చర్యలు, ఇతర పథకాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆమె మాటల్లోనే...

-ప్రజాశక్తి, పార్వతీపురంరూరల్





జిల్లాలోని ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి?

కొత్తగా జిల్లా ఏర్పడిన తర్వాత పార్వతీపురం డివిజన్‌లోని కేంద్రాలతో పాటు, పాలకొండ డివిజన్‌లోని కేంద్రాలను కలిపి పరిపాలన సౌలభ్యం కోసం 10 ప్రాజెక్టులను ఏర్పాటు చేశాం. ఇందులో 84 సెక్టార్లు, 2024 కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నాం.

మహిళల అరోగ్యానికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేపడుతున్న చర్యలు ఏమిటి?

దేశంలో గర్భిణులు రక్తహీనత వల్ల ఆమెతో పాటు దాని ప్రభావం శిశువుపై చూపడంతో మాతా శిశుమరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ పరిస్థితిని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారికి పౌష్టికాహారం అందించడమే కాకుండా రక్తహీనతను అరికట్టేందుకు నిర్ధేశించిన ఐరన్ ఫోలిక్ అసిడ్ మాత్రలు క్రమ పద్ధతిలో అందిస్తుంది. కేంద్రాల్లో నమోదైన ప్రతి గర్భిణీకి రక్తపరీక్షలు నిర్వహించి, నెలకు ఒక్కొక్కరికి 100 మాత్రలు పంపిణీ చేస్తున్నాం. రక్తహీనత అధికంగా ఉన్న వారికి 200మాత్రలు అందిస్తున్నాము, అలాగే బాలింతలపైన ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వారికి మాత్రలు అందజేస్తున్నాం. వీరికి పోషకాలతో కూడిన ఆహారాన్ని తప్పనిసరిగా కేంద్రాలకు పిలిచి అందిస్తున్నాం. రక్తహీనత ఉన్న పిల్లలకు ఐరన్ సిరప్‌ను నిర్ధేశిత కాలంలో అందిస్తున్నాం. ఇవిన్నీ పక్కాగా అమలు జరిగేలా పర్యవేక్షిస్తున్నాం.

బాల్యవివాహాల నిరోధానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

బాల్యవివాహాల జరగకుండా పటిష్టమైన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నాం. అయినా పల్లెల్లో ఉన్న సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాల వల్ల అక్కడక్కడా కొన్ని చోట్ల ఇలాంటి వివాహాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. వెంటనే స్పందించి, వివాహానికి సంబంధించిన ఇరువర్గాల వారికి కౌన్సిలింగ్ ఇచ్చి యువతీ, యవకులకు పెళ్లి వయసు వచ్చిన తర్వాతే వివాహాలు జరిగేలా చర్యలు చేపడుతున్నాం. ఇటీవలన గరుగుబిల్లి మండలం సన్యాశిరాజుపేటలో బాల్యవివాహం జరుగుతున్నట్లు కార్యకర్తల ద్వారా సమాచారం అందుకుని వెంటనే కుటుంబాలతో మాట్లాడి పెళ్లి వాయిదా వేయించగలిగాం. ఈవిషయంపై జిల్లాలోని అన్ని ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాల ద్వారా సమావేశాలు నిర్వహించి, ఈ సాంఘిక దురాచరంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం.

స్త్రీలపై లైంగికదాడులు, చిన్నారులపై అత్యాచారాల నిరోధానికి చేపడుతున్న చర్యలేమిటి?

మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు, చిన్నారులపై దాడులు వంటివాటిని అరికట్టడానికి వాటిపట్ల ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాల స్థాయి నుంచి సమావేశాలు నిర్వహించి ఫోక్సో, దిశ వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నాం. సచివాలయంలో మహిళా పోలీసు సిబ్బంది సహకారంతో పాఠశాలల్లోనూ, కెజిబివి, జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, దాడులు ఎలా జరుగుతాయి, జరిగే ముందు నేరస్తుల ప్రవర్తన ఎలా ఉంటుంది. విపత్కర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి, మహిళలకు అండగా ఉన్న చట్టాలపె నిత్యం అవగాహన కల్పిస్తున్నాం.

మిషన్ వాత్సల్య పథకం అంటే ఏమిటి?

ఎవరైనా పిల్లలు 0 నుంచి 18ఏళ్ల వయసు గల పిల్లలకు తల్లి లేదా తండ్రి లేదా ఇద్దరు లేని పిల్లల ఆర్థిక లేదా ఇతర అనగా పిల్లల వైద్య, విద్య, అభివృద్ధి అవసరాలు తీర్చడానికి కొంత సహాయం అందించడానికి కేంద్ర ప్రాయోజిత పథకమైన మిషన్ వాత్సల్య స్కాలర్‌షిప్ అందజేస్తుంది. ఈ స్కాలర్‌షిప్‌ల ద్వారా పిల్లలకు నెలకు రూ.4వేలు అందుతుంది. ఈ పథకం కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లల వరకు ధరఖాస్తు చేసుకోవచ్చు. ఇది నిరంతరం పథకం అయినా, దరఖాస్తుల స్వీకరణ ఈనెల 30తో ముగిసింది. ఇప్పటి వరకూ జిల్లా నుంచి 8వేలకు పైగా దరఖాస్తులు అందాయి. ఇంకా అందుతున్నాయి. వాటన్నిటిని ఆన్‌లైన్ చేసే పనిలో ఉన్నాం.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించడం ఎంతో మేలని స్థానిక అగ్నిమాపక అధికారి యు.సుధాకరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం స్థానిక ఆర్.కె.ఎన్‌క్లేవ్స్, విజయ రామరాజు నగర్ అపార్ట్‌మెంట్స్‌లో గ్యాస్, ఎలక్ట్రికల్ మంటలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానిక అగ్ని మాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, గ్యాస్ సిలిండర్ పేలినప్పుడు ఎలా అప్రమత్తంగా ఉండాలి, భారీ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది డెమో నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక ఎల్ఎఫ్ టి.ఉమా మహేశ్వరరావు, అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

విద్యార్థులకు బహుమతులు అందజేత

పాలకొండ: పట్టణంలో జ్ఞాన ప్రసూన స్టడీ సెంటర్‌లో నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహించిన నేపథ్యంలో మొదటి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ చేతుల మీదుగా ఆదివారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎం.సూర్యనారాయణ, భామిని ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు, జ్ఞాన ప్రసూన డైరెక్టర్ కెంబూరు కృష్ణ కిషోర్, గారాల సూర్యం, జడ్డు బాలరాజు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. 412 మంది విద్యార్థులు హాజరు అయినట్టు డైరెక్టర్ కష్ణ కిషోర్ తెలిపారు. ఉత్తమ మార్పులు పొందిన మొదటి 30 మంది విద్యార్థులకు మెడల్ మెమొంటో తో సబ్ కలెక్టర్ సత్కరించారు.

జియమ్మవలస : మండలంలోని పెదమేరంగి జంక్షన్లో గల శ్రీసత్య కైలాస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థాన విద్యార్థులకు బహుమతులను కరస్పాండెంట్ రౌతు అజయ్‌కుమార్ అందజేశారు. మండల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో 154 మంది హాజరయ్యారు. ప్రథమ స్థానం అల్లువాడకు చెందిన లోలుగు లిఖిత, ద్వితీయ స్థానంలో తానల భాగ్యశ్రీ, వి.రమేష్ నాయుడుకు కరస్పాండెంట్ అజయ్ కుమార్, హెచ్ఎం పి రాజశేఖర్ బహుమతులను అందజేశారు.



వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేస్తున్న సంజీవనాయుడు

పెదపెంకిలో కందుకూరి జయంతి వేడుకలు

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో ఆదివారం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకల స్థానిక నేతాజీ గ్రంథాలయం వద్ద ఆ సంస్థ నిర్వాహకులు ఈర్ల సంజీవనాయుడు సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు ఒక సంఘ సేవకునిగా ఆయన చేసిన సేవలు వర్ణణాతీతమన్నారు. మూఢనమ్మకాలు, బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దయానందు, శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి చెట్టు గుర్తింపు

పార్వతీపురం టౌన్ : పట్టణంలో మే 28, 29, 30 తేదీల్లో జరిగే అమ్మవారి ఉత్సవాలకు అవసరమైన సిరిమానును ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారంకొత్త (చిన్న చెరువు) చెరువు గట్టుపై గుర్తించారు. ఈ చెట్టును ఆ వార్డు కౌన్సిలర్ నిమ్మకాయల సుధీర్, వార్డు పెద్ద నిమ్మకాయల భాస్కరరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు అప్పగించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆ చెట్టును సిరిమాను తయారీకి తరలించారు.

అమ్మవారి పండగకు ఊరు చాటింపు

వీరఘట్టం : మే 7,8, 9 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ పైడితల్లి అమ్మవారి పండగకు సంబంధించి ఆదివారం ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌విఎల్ఎన్ శర్మయాజి, సర్పంచి, మాజీ సర్పంచులు పి.గౌరమ్మ, డి.లలితకుమారి, జామి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఊరు చాటింపు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోయుడుతో పాటు విఆర్‌ఎలు పట్టణంలోనే ప్రతి వీధిలోకి వెళ్లి చాటింపు కార్యక్రమం చేపట్టారు.



హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న పర్యాటకులు

పార్కులో పర్యాటకుల సందడి

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. ఆదివారం సెలవు, అందులో వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో కాసేపు పిల్లలతో పర్యాటకులు సేద తీర్చుకుంటున్నారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. జలవిహార వద్ద బోటు షికారు చేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆనందంగా గడిపారు. మరి కొంతమంది పిల్లలు కమాండో నెట్ ఎక్కి ఆడుకున్నారు అనంతరం మెట్టు గూడ జలపాతాన్ని సందర్శించారు.



భామినిలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

జగనన్నతోనే పేదల సంక్షేమం

భామిని : పేదల సంక్షేమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మండల సచివాలయం కన్వీనర్లు లోపింటి కృష్ణ, రొక్కం రమేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మా నమ్మకం నువ్వే జగన్నన కార్యక్రమం 7వరోజు భామినిలో ఆదివారం జరిగింది. స్థానిక సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక పార్టీ నేతల అధ్వర్యంలో చర్చి వీధిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, లబ్ధిదారుల అభిప్రాయం, సమస్యలను నేరుగా అడిగి తెలసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కీర్తి రాయి సుగ్రీవులు, సీనియర్ నాయకులు కొల్ల రామారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృంగిన కల్వర్టులు

మక్కువ: మండలంలోని డి-శిర్లాం పంచాయతీ కేంద్రంలో ప్రవేశించే రహదారుల్లో గ్రామానికి ఇరువైపులా ఉన్న కల్వర్టులు కృంగిపోయి పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు ఆందోళన చెందు తున్నారు. ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నుంచి దెబ్బగెడ్డ వైపు కొత్తగా నిర్మిస్తున్న రహదారి ప్రారంభంలోనే పాత కల్వర్టు పాడైపోయింది. పాత కల్వర్టును తొలగించి కొత్త కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే గ్రామం మధ్యలో కొత్తవలస వెళ్లే రోడ్డులో కల్వర్టుకు రంధ్రం ఏర్పడడంతో అది మలుపు ఉన్న ప్రాంతం కావడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టులు బాగు చేయాలని కోరుతున్నారు



డి-శిర్లాం వద్ద రోడ్డు మధ్యలో కూలిన కల్వర్టు

మూడేళ్లు కావస్తున్నా మొండిగోడలే



వీరఘట్టంలో మొండిగోడలతో దర్శనమిస్తున్న సచివాలయం

- బిల్లులందక కాంట్రాక్టర్లు అవస్థలు
- అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు
- పరాయి పంచన విధులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

గాంధీ కలలగన్న గ్రామ స్వరాజ్యాన్ని అందిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆ మేరకు సచివాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ మేరకు గ్రామాల్లో సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ తదితర భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. పనులు ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా నిధులు విదల్చకపోవడంతో ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి.. దీంతో సచివాలయ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులకు, సేవలందుకొనేందుకు వచ్చే ప్రజలుకు వసతి లేక నానా అవస్థలు పడుతున్నారు. మరికొన్ని చోట్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో మొండిగోడలు, పునాదులు దర్శనమిస్తున్నాయి.



చలివేంద్రిలో పునాదులకే పరిమితమైన సచివాలయం

బోర్డులకే పరిమితం

మండలంలోని సచివాలయాల భవనాలతో పాటు రైతు భరోసా, వెల్నెస్ కేంద్రాలు నిర్మించేందుకు పనులు చేపట్టారు. నడుకూరు, నరసిపురం, వండవ, కత్తులకవిటి, హుస్సేన్ పురం గ్రామాలు మినహా ఎక్కడ కూడా పూర్తికాలేదు. అయితే భవనాలు లేనప్పటికీ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలను పశువుల శాలల్లోను, చెట్ల కింద నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. చలివేంద్రి, దశమంతపురం చినగారకాలనీ, వీరఘట్టంలో వెల్నెస్ భవనాలు ప్రారంభించలేదు. చలివేంద్రానికి వెల్నెస్ భవనం నిర్మించాలని అడ్వాన్స్ డబ్బులు కూడా తీసుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల కూడా పరిస్థితి ఇదే.



వీరఘట్టంలో వెల్‌నెల్ నిర్మాణం కాకపోవడంతో ఆరుబయటే వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

మండలంలోని 24 సచివాలయాల పరిధిలో ప్రభుత్వ భవనాలు మంజూరయ్యాయి. ఇందులో తలవరం, పనస నందివాడ, కత్తులకవిటి, చిదిమి, తూడి, హుస్సేన్ పురం, వండువ, కిమ్మి, నడిమికెళ్ల, చిట్టిపూడివలస, దశమంతపురం, వీరఘట్టంలో గ్రామాల్లో 90 శాతం భవనాల పనులు పూర్తయినప్పటికీ గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా నిలిపి వేశారు. కిమ్మి, తూడి, నడిమికెళ్ల గ్రామాల్లో భవనాలు పూర్తిస్థాయిలో పనులు చేపట్టినప్పటికీ అధికారులు బిల్లులు చెల్లించకపోవడంతో భవనాలు అధికారులకు కాంట్రాక్టర్ అప్పగించలేదు. చలివేంద్రి, వీరఘట్టం, రేగులపాడు, నడుకూరు, బిటివాడ, తదితర గ్రామాల్లో భవనాల పనులు పునాదులకే పరిమితమయ్యాయి. దీంతో మండలంలోని రేగులపాడు, తూడి, చిన్నగారకాలనీ, వీరఘట్టం తదితర గ్రామాల్లో ఉద్యోగులు పరాయి పంచిన విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇదే విషయంపై గత ఏడాది జులైలో మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో తూడి సర్పంచి కె.వెంకటరమణ మాట్లాడుతూ అద్దె భవనంలో సచివాలయం సిబ్బంది విధులు నిర్వహించడం వల్ల అద్దె కట్టలేకపోతున్నామని వాపోయారు. తూడిలో సచివాలయం పూర్తయినప్పటికీ గుత్తేదారులకు సుమారు రూ.6లక్షలు చెల్లించాల్సిన ఉన్నప్పటికీ ఇంతవరకు చెల్లింపులు జరగకపోవడంతో ప్రస్తుతం కార్యకలాపాలు అద్దె భవనం కొనసాగిస్తున్నారు. నడిమికెళ్ల, కిమ్మి గ్రామాల్లో భవనాలు పూర్తయినప్పటికీ గుత్తేదారులు బిల్లులు చెల్లించకపోవడంతో ఉద్యోగులు ఇరుకైన గదుల్లోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ భవనాలు ఎప్పుడు పూర్తవుతాయో ప్రజలకు ఎప్పుడు మెరుగైన సేవలందుతాయో వేచి చూడాల్సిందే.

పేదలకు టిడ్కో ఇళ్లు ఇవ్వలేదు

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో పేదల కోసం టిడిపి ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లు ఇంతవరకు వైసిపి ప్రభుత్వం అప్పగించలేదని, మధ్యతరగతి ఉద్యోగుల కోసం స్మార్ట్ టౌన్ షిప్‌లు కడతామంటే ఎలా నమ్ముతారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి ప్రశ్నించారు. ఆదివారం ఆమె పట్టణ పేదల కోసం చంద్రప్పవలసలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సెల్ఫీ ఛాలెంజ్‌ను విసిరారు. ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేయడానికే వైసిపి ప్రభుత్వం స్మార్ట్ టౌన్‌షిప్‌ల పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందన్నారు. జగన్ ప్రభుత్వం గురించి తెలిసిన వారెవ్వరూ వారి మాయలో పడబోరని సంధ్యారాణి చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, మండల నాయకులు భాస్కరరావు పాల్గొన్నారు.

ఒక్కపూటే ఉపాధి పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - సీతానగరం


ఉపాధి హామీ పనులు ఒక పూట చేసేలా అనుమతి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేసవి ఎండలు పెరుగుతున్నందున ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో వేతనదారులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కావున అధికారులు గుర్తించాలన్నారు. గత రెండు రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్నందున వేతనదారులు వడదెబ్బకు గురై ప్రమాదం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

ఏజెన్సీలో రహదారు(ణా)లు

అవస్థలు పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలోని రహదారులు నరకానికి నకలుగా ఉన్నాయి. ఇప్పటికే రహదారులు సక్రమంగా లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నారు. ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే ముందుగా రహదారి అవసరం. అలాంటిది రోడ్లు లేకపోతే గిరిజన గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. సీతంపేటలో ఐటిడిఎ ఉన్నప్పటికీ రహదారి పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గోంగలు అక్కడే అన్న చందంగా ఉంది. ఏజెన్సీలో ఇప్పటి వరకూ కనీసం 33 గ్రామాలకు రహదారులు లేవు. దీంతో కనీసం వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి. మండలంలోని గుడ్డిమీదగూడ జంక్షన్ నుంచి ఒంగ్రుజోల, కడగండి వెళ్లి రహదారి పూర్తిగా మరమ్మతులకు గురైంది. ఈ రహదారి గుండా సుమారు 200 గ్రాముల వరకు రాకపోకలు, మూడు మండలాల వరకు సంబంధాలు ఏర్పడతాయి. అలాగే కుసిమి జంక్షన్ నుంచి ముత్యాలు వైపు వెళ్లే రహదారి పూర్తిగా పాడైపోయింది. మర్రిపాడు నుంచి పూతికవలస వరకు రహదారి గోతులు మయంగా మారింది. గోరపాడు నుంచి తుంబన్న కాలనీ వరకు రాళ్లు తేలిపోయాయి. దీంతో గిరిజనులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. అంటికొండ ఉసిరికిపాడు, రంగంవలస, పెద్దసంకిలి, సుక్కిగాడుగూడ నుంచి రాజుగాడు గూడ వరకు రహదారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నడిమి డుంబంగివలస నుంచి ఎగువ డుంబంగివలస వరకు రహదారి లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న బగ్గ నుంచి ఎగువ సంకిలి, బొండి ఎగువబండి, మంగళ బొండి మీదుగా ఈ రహదారి రాళ్లు తేలి ఉన్నాయి. అక్కడ బ్రిడ్జి కూడా కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. దీంతో గ్రామస్తులు సర్పంచ్ నీలయ్య సహాయంతో సిమెంట్ కట్లు సపోర్టు చేశారు. ఈ గ్రామాలకు రోడ్డు సదుపాయాల్లేకపోవడంతో అత్యవసర సమయంలో గిరిజనులు నానా అవస్థలుపడుతున్నారు. మరో పక్క గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను సంతల్లోకి తీసుకొచ్చి విక్రయించాలంటే రవాణా సౌకర్యం ఉండాలి. రహదారి లేకపోవడంతో బస్సులు, లగేజ్ వాహనాలు లేకపోవడంతో అటవీ ఉత్పత్తులు కూడా ఎంతో కొంతకు గ్రామాల్లోకి వచ్చిన వ్యాపారులకు విక్రయించాల్సి పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు, అగ్నిమాపక శకటం కొన్ని రహదారులకు వెళ్లలేని పరిస్థితి ఉంది. దీనిపై ట్రైబల్ వెల్ఫేర్ ర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి మురళి వద్ద ప్రస్తావించగా గ్రామాలకు కనెక్టివిటీ రహదారులకు ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామన్నారు.



రాళ్లు తేలిన మర్రిపాడు-పూతికవలస రహదారి

రహదారులు వేయాలి

నడిమి, డుంబంగివలస నుంచి ఎగువ డుంబంగివలస వరకు పూర్తిగా రోడ్డు లేదు అదే విధంగా మర్రిపాడు నుంచి పూతికవలస వరకు రోడ్డు గోతులు మయంగా మారింది. వెంటనే రోడ్లు వేయాలి.



మండంగి వెంకటేష్, గిరిజనుడు పూతికవలస.



సిఐటియులో చేరిన మ్యాక్సీ క్యాబ్ కార్మికులు

సిఐటియులో 40 మంది మ్యాక్సీ క్యాబ్ కార్మికుల చేరిక

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

కోటదుర్గ మ్యాక్సీ క్యాబ్ స్టాండ్ పాలకొండ టు రాజాం చెక్‌పోస్ట్ సెంటర్లో సీరియల్ పాయింట్లో ఉన్న మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్స్ అంతా సిఐటియులో జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు సమక్షంలో ఆదివారం చేరారు. అనంతరం రమణారావు మాట్లాడుతూ రోడ్డు రవాణా భద్రత బిల్లులు సవరణలో మోటార్ రంగానికి తీవ్ర నష్టం చేకూర్చిందని, ఆలిండియా ట్రాన్స్పోర్ట్ యూనియన్ పిలుపులో అందరూ భాగస్వాములు కావాలని, ట్రాన్స్పోర్ట్ కార్మికులను వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి కాద రాము అధ్యక్షతన సమావేశం జరిగింది. ఏపీ ట్రాన్స్పోర్ట్ యూనియన్ సిఐటియు అనుబంధ సంస్థలో కోట దుర్గ మ్యాక్సీ క్యాబ్ స్టాండ్ పాలకొండ టు రాజాం యూనియన్ విలీనం చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొనగానే శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడుగా బుడుమూరు శంకర్ రావు, కార్యదర్శిగా ఎ.రామారావు, సహాయ కార్యదర్శిగా కందికొండ వాసు, కోశాధికారిగా ఎ.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా ఎ.చిట్టి బాబు తదితరులను ఎన్నుకున్నారు.

పేరుకుపోయిన అపారిశుధ్యం

మక్కువ: మండలంలోని పలు పంచాయతీల్లో అపారిశుధ్యం పేరుకు పోతోంది. గతంలో గ్రీన్‌అంబాసిడర్లలో గ్రామంలో చెత్తను చెత్తశుద్ధి కర్మాగాలకు తరలించేవారు. ప్రస్తుతం వారికి పంచాయతీల నుంచి జీతాలు చెల్లించాలని నిబంధనలున్నా సకాలంలో చెల్లించకపోవడంతో వారు అంతంత మాత్రమే పనులు చేపడుతున్నారు. వీరి సమస్యలు పాలకులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతుంది. మండలంలోని డి.శిర్లాం పంచాయతీలో పారిశుధ్యం పేరుకుపోయి పందులు స్వైర విహారం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జాగాన వీధి, మధ్య వీధి నడుమ పూర్వకాలం వేసిన కాలువ పూర్తిగా మూసుకుపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుపర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గిరిజనుల గోడు పట్టదా?

మెంటాడ: డిప్యూటీ సీఎం గారు! ఆంధ్ర, లోతు గెడ్డ గిరిజనులు గోడు మీకు పట్టదా? అని లోతు గెడ్డ గిరిజన సంఘం నాయకులు వంతు రాంబాబు, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు రాకోటి రాములు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఉపముఖ్యమంత్రి తోపాటు గిరిజన శాఖ మాత్యులుగా పనిచేసిన తమకు ఎంతో అనుభవం ఉన్న ఎందుకు గిరిజనుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఐదవ షెడ్యూల్ ఏరియాలో గిరిజన గ్రామాలను చేర్చాలని, ఎస్‌టి ఏరియా ధ్రువపత్రాల అందించాలని, ఆంధ్ర ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల చేయాలని, ఆంధ్ర ప్రాజెక్టులో భూములు కోల్పోయిన గిరిజనులకు సొసైటీ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. గిరిజనులకు ఉపాధి కల్పించాలని, డిమాండ్ చేశారు

ఉల్లి కషాయంతో రసం పీల్చే పురుగు నివారణ

ప్రజాశక్తి - పాచిపెంట

మిర్చి పంటను ఆశించే రసం పీల్చు పురుగుల నివారణకు మొట్టమొదటిసారిగా ఉల్లిపాయల కషాయం ద్వారా నివారించవచ్చునని మండల వ్యవసాయాధికారి కె.తిరుతిరావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని పాంచాలి రైతు భరోసా కేంద్రం వద్ద ప్రయోగాత్మకంగా ఎంసిపి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో రైతు సేనాపతి రాంబాబు ద్వారా తయారు చేయించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ మిర్చి పంటల దిగుబడి తగ్గడానికి ప్రధాన కారణం రసం పీల్చు పురుగులు, తామర, నల్లి జాతి పురుగులని తెలిపారు. తామర పురుగుల ఆశిస్తే మిర్చి ఆకులపైకి ముడుచుకుంటాయని నల్లి పురుగులు ఆశిస్తే ఆకుల కాడ సాగినట్లు అయి ముదురు ఆకుపచ్చ రంగులోనికి మారి ఆకులు కిందికి ముడుచుకొని ఉంటాయని తెలిపారు. దీనివల్ల మిరపకాయలు గిడసబారి దిగబడి గణనీయంగా తగ్గిపోతాయని తెలిపారు. మార్కెట్లో దొరికే రసం పీల్చు పురుగుల మందులు ఖరీదు కనీసం ఎకరానికి రూ.500 ఖర్చవుతుందన్నారు. ఈ రసాయనాల వల్ల మిత్ర పురుగులు కూడా చనిపోతాయన్నారు. కావున ప్రకృతి సిద్ధంగా తయారైన కషాయాల ద్వారా రసం పీల్చు పురుగులను అరికట్టగలిగితే రైతులకు సాగు ఖర్చు భారం తగ్గడమే కాకుండా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. మొట్టమొదటిసారిగా ఈ ఉల్లి ద్రావణం కషాయం ప్రయోగానికి ముందుకు వచ్చినందుకు రైతుల అభినందించారు.

ఉల్లి కషాయం తయారీ విధానం

ఐదు కిలోల ఎర్ర ఉల్లిగడ్డలు, కిలో వెల్లుల్లి, కిలో పచ్చిమిర్చిను బాగా ముద్దగా నూరి 20 లీటర్ల ఆవు మూత్రంలో మరిగించి చల్లార్చిన తర్వాత వడగట్టి ఈ ద్రావణాన్ని వంద లీటర్ల నీటిని కలిపి ఒక పావు లీటర్ కుంకుడు కాయల రసం కలిపి ఒక ఎకరానికి పిచికారి చేసుకోవచ్చు. ఇది రెండు మూడు నెలల పాటు నిల్వ ఉంటుందని తెలిపారు.

అనంతరం మిర్చి పంటకు బలాన్ని చేకూర్చడానికి జిల్లేడు ఆకుల ద్రావణాన్ని తయారు చేయించారు. దీనికోసం ఎకరానికి 15 నుండి 20 కిలోల జిల్లేడు ఆకులను ముక్కలుగా చేసి 150 లీటర్ల నీటిలో 48 గంటల పాటు నానబెట్టి వడగట్టి పిచ్చికారీ చేసుకుంటే పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈడుపులి శ్రీను, ఐసిఆర్‌పి రమణ, రైతులు పాల్గొన్నారు.



వీరఘట్టం : సేంద్రియ ఎరువుల తయారీని చూపుతున్న విద్యార్థిని అశ్వని

సేంద్రియ ఎరువులతో పంటలు సాగు

వీరఘట్టం : సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేస్తే పంటలు దిగుబడితో పాటు ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఒడిశాలోని వ్యవసాయ సెంచూరియన్ కాలేజీలో శిక్షణ పొందుతున్న విద్యార్థిని ఒ.అశ్వని తెలిపారు. ఆ విద్యా సంవత్సరం చివరి ఏడాదిలో ప్రాజెక్టుపై ఆదివారం వీరఘట్టంలో అశ్విని రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ విధానంలో తయారు చేయాల్సిన పద్ధతులపై డెమో ప్రకారం రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ పంటల సాగులో క్రిమిసంహారక మందులు రసాయినిక ఎరువుల కంటే సేంద్రియ విధానంలో పంటలు సాగు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయంపై మక్కువ చూపి ఆ విధానాన్ని అవలంబించేందుకు చొరవ చూపాలని రైతులకు వివరించారు. జీవామృతాన్ని తయారు చేసుకొనే విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు.

నేరాలు ఘోరాలు

రైలు దిగుతూ కాలు జారి విద్యార్థి మృతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక పట్టణ రైల్వే స్టేషన్‌లో విశాఖ - దుర్గ్ రైలు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మతి చెందాడు. రైల్వే పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా వంగర మండలం రాజులగుమ్మడకు చెందిన గంటా శివున్నాయుడు (15) విజయనగరం జిల్లా గొట్లాంలోని గాయత్రి కాలేజీలో పదో తరగతి చదువుతున్నాడు. పరీక్షలు రాసి ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు రైలు నుండి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులు కు అప్పగించడం జరిగింది అని రైల్వే పోలీసులు తెలియచేశారు

ఆటో బోల్తా.. బాలిక మృతి

రామభద్రపురం: స్థానిక శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ పట్నాన లక్ష్మణ తన సోదరుని పిల్లలను సెలవు రోజైనా ఆదివారం తన ఆటోలో షికారుకు తీసుకు రాగా ఆటో అదుపు తప్పిన ప్రమాదంలో సోదరుని బిడ్డ పట్నాన అఖిల (8) ఆటో కింద పడి మృతి చెందింది. ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో సరదాగా పిల్లలను ఆటోలో షికారుకు తీసుకు వస్తున్న సమయంలో బుసాయవలస రహదారి పక్కన ఉన్న చర్చ్ సమీపంలో ఆటో తిప్పేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా ఆటో అదుపుతప్పి పక్కకు పడిపోయింది. ఆటోలో ఉన్న అఖిల ఒక్కసారిగా ఆటో నుంచి తుల్లి పడి ఆటో కిందకు వెళ్లి పోవడం, అదే సమయంలో ఆటో పాప మీద పడటంతో గాయాలు పాలైంది. చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గం మధ్యలో పాప మృతి చెందింది. మృతురాలి తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళను కొట్టి దోపిడీ

కొత్తవలస : స్థానిక కుమ్మర వీధిలో పట్టపగలు గుర్తుతెలియ వ్యక్తి మహిళను కొట్టి గాయపరిచి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు దోచిన సంఘటన శనివారం జరిగింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు అందించిన సమా చారం మేరకు.. కుమ్మర వీధిలో నివాసముం టున్న మడబొట్టిన సూర్యకాంతంను, మధ్యా హ్నం ఒంటిగంట ప్రాంతంలో ఒంటరిగా ఇంట్లో ఉండడాన్ని గమనించిన దుండగడు ఇంట్లో ప్రవేశించి, ఆమె కళ్ళల్లో కారం చెల్లి, బలమైన ఆయుధంతో తలపై కొట్టి గాయపరిచాడు. ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెలతాడు, చెవులకు ఉన్న మూడు గ్రాముల ఎత్తు గొలుసులు తెంపుకొని వెళ్లిపోయాడు. ఆమె తలకు బలమైన గాయం కావడంతో కుప్ప కూలిపోయింది. వెంటనే ఆమె బంధువులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. బాధితురాలు అన్నయ్య సుధా అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కొత్తవలస సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.